## ఆడపిల్ల ఇంటికి మణి దీపం

కూసుమంచి/ఏప్రిల్ 9: ప్రతి ఇంటికి ఆడపిల్ల మణి దీపం అని, ఆడపిల్లతోనే ఇంటికి లక్ష్మీకటాక్షం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. బుధవారం కూసుమంచి, కొణిజర్ల, బోనకల్లు, తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ఆడపిల్ల పుట్టిన కుటుంబాలను అధికారులు సందర్శించారు. మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో ఆడపిల్ల జన్మించిన దంపతులను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అధికారులు సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుంటున్నారన్నారు. తల్లిదండ్రులు ఆడ పిల్లలను బాగా చదివిస్తే మంచి భవిష్యత్‌లో పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తారని వివరించారు.

## ఉపాధి యూనిట్లను ఎంపిక చేసుకోవాలి

మధిర, ఏప్రిల్ 9: జీవనం కోసం ఉపాధి కల్పించే యూనిట్లను ఎంపిక చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బీ.పురంధర్ అన్నారు. బుధవారం మధిర వర్తక సంఘం కళ్యాణ మండపంలో మైనార్టీ సంఘాల సభ్యులకు రాజీవ్ యువవికాస్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బీ.పురంధర్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రేషన్‌కార్డు ఉన్న వారికి ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేదన్నారు. సమావేశంలో మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, మండల పరిషత్ అధికారి బీ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ యాప్ సేవలపై అవగాహన

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 9: ఆన్‌లైన్ యాప్ ద్వారా లైన్ క్లియరెన్స్‌పై విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఖమ్మం నగరంలోని విద్యుత్‌శాఖ అతిథి గృహంలో ఖమ్మం రూరల్ డివిజన్ పరిధిలోని ఓఎం సిబ్బంది, ఏఈలు, సబ్ ఇంజినీర్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. లైన్ క్లియరెన్స్‌కు ఆన్‌లైన్ యాప్ ద్వారా తీసుకునే క్లియరెన్స్‌పై టెక్నికల్ ఏఈ షేక్ రజియా, మాస్టర్ ట్రైనర్ నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు.

## కరుణగిరిలో పోషణ పక్షోత్సవాలు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 9: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ స్వగృహకల్పలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు జరిగాయి. మండల స్పెషల్ ఆఫీసర్ బీ జ్యోతి, ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు సీడీపీవో కమలప్రియ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

## రేపు, ఎల్లుండి 'బొమ్మ'లో కల్చరల్ ఫెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రాజేశ్వరరావు, సత్యప్రసాద్

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 9: ఖమ్మంలోని తమ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో నేషనల్ టెక్నికల్ ఫెస్ట్, కల్చరల్ ఫెస్ట్, వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు బొమ్మ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ సత్యప్రసాద్ తెలిపారు. కళాశాలలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వేడుకలకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జైళ్లశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ సంపత్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని, ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు అందిస్తామన్నారని వివరించారు.

## ఒలింపియాడ్‌లో 'వండర్‌కిడ్స్' విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ శశిధర్‌రెడ్డి

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 9: ఐఐటీ ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు సత్తా చాటారని ఖమ్మంలోని వండర్‌కిడ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ కొండపల్లి శశిధర్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మాజీ కార్పొరేటర్ తోట రామారావు మెమెంటోలు అందజేశారు. పోటీ పరీక్షలవైపు విద్యార్థులను ప్రోత్సహిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. నరసింహారెడ్డి, పూర్ణబిందు, ఎస్కే.జానిమియా, చామకూరి రమేష్, ఝాన్సీరెడ్డి, జానిమియా పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పంట

మధిర( చింతకాని) ఏప్రిల్ 9: ఆరుగాలం కష్టపడి పండించి చేతికందిన పంట కళ్ళముందే అగ్నికి ఆహుతైన ఘటన చింతకాని మండలం పాతర్లపాడులో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతు కొత్తపల్లి వెంకటి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఓ రైతు వద్ద మూడు ఎకరాలభూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాడు. పంటలో కొంత భాగాన్ని కంకి విరిచి కుప్పలుగా పోశాడు. మిగిలిన కంకి అలాగే ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో గాలి దుమారానికి మంటలు ఎగిసిపడుతూ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కుప్పలుగా పోసిన మొక్కజొన్న కంకి కాలిపోవడంతో పాటు పైరు ఉన్న మొక్కజొన్న చేను అంతా కాలి బూడిదయింది. తాను పూర్తిగా నష్టపోయానని, ప్రభుత్వం తన ఆదుకోవాలని అధికారులు వేడుకుంటున్నాడు.

# ప్రభుత్వాసుపత్రులపై నమ్మకాన్ని పెంచాలి

**హైవే పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి**

**పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి**

**సమీక్షలు, పర్యటనల్లో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ కాన్**



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం/మామిళ్లగూడెం/ ఖమ్మం సిటీ, ఏప్రిల్ 9: ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ ప్రభుత్వాసుపత్రులపై నమ్మకాన్ని పెంపొందించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. హైవే పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. వివిధ శాఖలపై ఐడీవోసీలో బుధవారం సమీక్ష నిర్వహించిన కలెక్టర్.. అనంతరం వివిధ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వైద్యారోగ్య శాఖ పనితీరుపై ఐడీవోసీలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలని, మరుగుదొడ్ల మరమ్మతులు, మరో అంతస్తు నిర్మాణం, లిఫ్ట్ ఏర్పాటు వంటి పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అనంతరం ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని రోటరీ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్‌ను, ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తామని అన్నారు. ఇక్కడి సేవా కేంద్రం ద్వారా అందించే సేవలపై ప్రచారం నిర్వహించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా సేవా కేంద్రం ఆవరణలో కలెక్టర్ మొక్క నాటారు. అనంతరం, జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, అటవీ, రెవెన్యూ భూముల సమస్యలపై ఆయా శాఖల అధికారులతో ఐడీవోసీలో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పులిగుండాల ఎకోటూరిజంపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. తరువాత, జాతీయ రహదారుల నిర్మాణం, మున్నేరు రిటైనింగ్ వాల్, కిష్టారం గ్రామ సమస్యలపైనా సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలాంటి అడ్డంకులు లేకుండా నేషనల్ హైవేల పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం, కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదామును నెలవారీ తనిఖీలో భాగంగా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎం గోదాము వద్ద పటిష్ట నిఘా ఉంచాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు శ్రీనివాసరెడ్డి, శ్రీజ, వివిధ శాఖల అధికారులు సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ కళావతీబాయి, ఎన్.రవీంద్రనాథ్, దొడ్డపనేని సాంబశివరావు, రాజేశ్వరి, నర్సింహారావు, రాజేందర్, రామాంజనేయరెడ్డి, శాలెంరాజు పాల్గొన్నారు.

## సీపీఎం నేత అంతిమయాత్రలో మాజీ మంత్రి అజయ్, ఎంపీ వద్దిరాజు

### ఎర్రా శ్రీకాంత్ మరణం..

# ప్రజా ఉద్యమాలకు తీరని లోటు



నివాళిఅర్పిస్తున్న అజయ్‌కుమార్



పాడె మోస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఏప్రిల్ 9: సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీకాంత్ మరణం.. ప్రజా ఉద్యమాలకు తీరని లోటని రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. పేదల సమస్యల పరిష్కారానికి ఆయన నిత్యం ప్రజా పోరాటాలు చేశారని గుర్తుచేశారు. తమిళనాడులో ఇటీవల జరిగిన సీపీఎం జాతీయ మహాసభల్లో పాల్గొన్న ఆయన.. అక్కడే గుండెపోటుతో మృతి చెందారు. ఖమ్మంలో బుధవారం శ్రీకాంత్ ఇంటి వద్ద అతడి భౌతికకాయానికి అజయ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, కూరాకుల నాగభూషణం, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కర్నాటి కృష్ణ, మక్బుల్, బచ్చు విజయ్‌కుమార్, బుర్రి వెంకట్‌కుమార్, మాటేటి నాగేశ్వరరావు, పాలడుగు పాపారావు, మందడపు రామకృష్ణ, మస్తాన్, ఖయ్యూం, దడాల రఘు, ఎర్రా అప్పారావు, మాటేటి కిరణ్‌కుమార్, లెనిన్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన శ్రీకాంత్ అంతిమయాత్రలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొని పాడె మోశారు. అనంతరం అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, శ్రీకాంత్ అంతిమ సంస్కారాల సందర్భంగా ఖమ్మం వైకుంఠధామం వద్ద మాటేటి కుటుంబ సభ్యులందరూ కలిసి శ్రీకాంత్ భౌతికకాయానికి గజమాలతో ఘన వీడ్కోలు పలికారు. మాటేటి కుటుంబ సభ్యులు రామారావు, నాగేశ్వరరావు, వెంకన్న, శ్రీను, కిరణ్‌కుమార్, రవి, రాకేశ్ పాల్గొన్నారు.

**ఎర్రా శ్రీకాంత్‌కు అంతిమ వీడ్కోలు**

ఖమ్మం కమాన్‌బజార్, ఏప్రిల్ 9: సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీకాంత్‌కు ఆ పార్టీ నాయకులు అంతిమ వీడ్కోలు పలికారు. ఖమ్మం శ్రీనివాసనగర్‌లో బుధవారం జరిగిన ఆయన అంతిమయాత్రకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్‌కుమార్ హాజరై శ్రీకాంత్ భౌతికకాయానికి నివాళులర్పించి పాడె మోశారు. తమ్మినేని వీరభద్రం, పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బీ.వెంకట్, వై.విక్రమ్, జబ్బార్ పాల్గొన్నారు.

**రేషన్ డీలర్ల నివాళి**

రఘునాథపాలెం, ఏప్రిల్ 9: సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీకాంత్ మృతి పట్ల రేషన్ డీలర్ల సంఘం ఖమ్మం నగర నాయకులు గోళ్ల మురళి, సిద్దంశెట్టి శేషగిరిరావు, షేక్ జానీ మియా, షేక్ ఖాసంబీ, శ్రీనివాసరావు తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## సింగరేణి క్వార్టర్స్‌లో భారీ చోరీ

**అర్ధరాత్రి ఆరు ప్లాట్లలో సుమారు రూ.49 లక్షలు మాయం**

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 9: పట్టణంలో ఏకకాలంలో ఆరు ఇళ్లలో చోరీలు జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి సింగరేణి క్వార్టర్స్(పీవీఎన్ రావు సెంటనరీ కాలనీ) కాంపౌండ్ వాల్ వెనుక నుంచి ముగ్గురు దుండగులు లోపలికి దూకారు, ముఖం కనిపించకుండా మంకీ క్యాప్ ధరించారు. బాధితుల ఫిర్యాదుతో ఈ క్వార్టర్స్‌ను కల్లూరు ఏసీపీ ఎ.రఘు బుధవారం చేరుకుని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. ఖమ్మం నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ రప్పించారు. ఆగంతకుల వేలి ముద్రలను నిపుణులు సేకరించారు. .జి.రాజశేఖర్ క్వార్టర్‌లో 400 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి; షుకూర్ ఫ్లాట్‌లో రూ.లక్ష, సుందరం ఇంట్లో 100 గ్రాముల బంగారం, పొట్టి కిరణ్ ఫ్లాట్‌లో 60 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి; విజయకుమార్ ఫ్లాట్‌లో 20 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి పోయినట్లు బాధితులు తమ ఫిర్యాదుల్లో తెలిపారు. రామస్వామి ఫ్లాట్‌లోకి కూడా దొంగలు వెళ్లారు. ప్రవేశించగా అక్కడ ఏమీ లభించకపోవడంతో వస్తువులన్నీ చిందరవందరగా పడేశారు. మొత్తం సుమారు రూ.49 లక్షల విలువగల 600 గ్రాముల బంగారం, రూ.4.75 లక్షలు విలువ గల వెండి చోరీ అయింది. మరికొందరి ఇళ్లలో కూడా చోరీ జరిగినట్లుగా అనుమానిస్తున్నామని, సంబంధిత యజమానులు లేకపోవడంతో పూర్తి వివరాలు తెలియలేదని పోలీస్ అధికారులు చెప్పారు. ఏసీపీ రఘు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు సాగిస్తున్నాయి.

## జేవీఆర్ ఓసీ, జేవీఆర్ సీహెచ్‌పీ తనిఖీ



జేవీఆర్ ఓసీ తనిఖీ చేస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 9: కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి జేవీఆర్ ఓసీని, జేవీఆర్ సీహెచ్‌పీని ఈఅండ్ఎం డైరెక్టర్ డి.సత్యనారాయణరావు బుధవారం తనిఖీ చేశారు. జేవీఆర్ సీహెచ్‌సీలోని డిశ్చార్జ్ పాయింట్లను, సైలోబంకర్‌ను కూడా తనిఖీ చేశారు. అక్కడి నుంచి దుమ్ము ధూళి నివారణపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. జీఎం( సివిల్) టి.సూర్యనారాయణ, జీఎం(సీహెచ్‌పీ) తిరుమలరావు, ఎస్‌ఓటు జీఎం జేవీ కోటిరెడ్డి, ఏరియా ఇంజినీర్ కె.సూర్యనారాయణరాజు, జేవీఆర్ సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ కె.సోమశేఖర్, జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఇంజినీర్ శ్రీనివాసరావు, జేవీఆర్ ఓసీ మేనేజర్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'మందడపు'ను పరామర్శించిన అజయ్‌కుమార్



నర్సింహారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, ఏప్రిల్ 9: ఖమ్మం ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మందడపు నరసింహారావును మాజీ మంత్రి పువాడ అజయ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. నర్సింహారావు ఇటీవల మోకాలు ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకున్న అజయ్.. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని నర్సింహారావు ఇంటికి బుధవారం వెళ్లారు. నర్సింహారావు ప్రస్తుత ఆరోగ్యం గురించి, యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కేఎంసీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, పార్టీ నాయకులు సిరిపురపు సుదర్శన్, భూక్యా లక్ష్మణ్‌నాయక్, భూక్యా రాము, అజయ్, విజయ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## పెనుబల్లి ఆసుపత్రి సందర్శించిన ఎమ్మెల్యే



ఆసుపత్రిలో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే మట్టా రాగమయి

పెనుబల్లి, ఏప్రిల్ 9: పెనుబల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి బుధవారం సందర్శించారు. ల్యాబ్, ఎక్స్‌రే రూం, ఓపీ, రికార్డులు పరిశీలించారు. డాక్టర్స్, సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో పాల్గొన్నారు. సమస్యలను తెలుసుకున్నారు. తహసీల్దార్ ప్రతాప్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి పంటనష్ట పరిహారం ఇవ్వాలి

ఎర్రుపాలెం, ఏప్రిల్ 9: మండలంలో అకాల వర్షాలు, ఈదురుగాలులతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని భీమవరం, గుంటుపల్లిగోపవరం పలు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను సీపీఎం నాయకులు పరిశీలించారు. జిల్లాలో అకాల వర్షాలు, ఈదురు గాలులతో పంటలు దెబ్బతిన్న రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు జరిగిన నష్టాలను తక్షణమే నమోదు చేసి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

## పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి




తిరుమలాయపాలెం : బచ్చోడులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు, ప్రజలు

వైరాటౌన్, ఏప్రిల్ 9: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. పార్టీ పట్టణ కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర రూ.50లు, పెట్రోల్, డీజిల్ ధర లీటరుకు రూ.2లు పెంచడం వలన పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్రంగా భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, గుడిమెట్ల రజిత, హరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 9: తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలో ప్రధాన రహదారిపై అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 9: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య రైతులకు సూచించారు. మండలంలోని మేడిదపల్లి, సుబ్లేడు ప్రాంతంలో బుధవారం ఆయన యాసంగి వరి పొలాలను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారామరెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**

ముదిగొండ, ఏప్రిల్ 9: మండలంలోని పెద్దమండవ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు విజయచంద్ర బుధవారం ప్రారభించారు. కార్యక్రమంలో ఏవో వేణు, ఏఈవో నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

sf | సుందరం హోమ్
సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: నం. 21, పట్టుల్లోస్ రోడ్, చెన్నై - 600002. ఫోన్: 044-2852 1181.
కార్పొరేట్ కార్యాలయం: "సుందరం టవర్స్", 46, వైట్స్ రోడ్, చెన్నై - 600014.
ఫోన్: 044-2851 5267. ఈ -మెయిల్: corporateaffairs@sundaramhome.in
వెబ్ సైట్: www.sundaramhome.in,
CIN: U65922TN1999PLC042759

సవరణ

ఇంటి నం. 15-9-533, మొదటి అంతస్తు, తిరుమల కాంప్లెక్స్, వైరా రోడ్, ఖమ్మం - 507002 వద్ద గల మా ఖమ్మం శాఖ డోర్ నం. 15-9-543, సాయి ప్రశాంతి కాంప్లెక్స్, రెండవ అంతస్తు, కవిరాజ్ నగర్, వైరా రోడ్, ఖమ్మం - 507002 (లాండ్ మార్క్ హెూండా షోరూమ్ పైన)కి 11-03-2025 నుండి వర్తింపుతో బదిలీ చేయబడుతుందని తెలియజేస్తూ 04-12-2024 తేదీ గల మా ప్రచురణ తదుపరిగా ఇందు మూలంగా తెలియ జేయునది ఏమనగా, పైన తెలిపిన నూతన ఆవరణకు మార్పుట అనునది అనివార్య కారణాల వలన 11-04-2025కు వాయిదా వేయబడినది. మా శాఖ ప్రస్తుత ప్రదేశం లోనే 10-04-2025 వరకు నిర్వహణకు కొనసాగుతుంది.

ప్రదేశం: చెన్నై, తేది: 10-04-2025

సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున
ఆర్. వెంకటసుబ్రమణియన్,
చీఫ్ కాంప్లియెన్స్ ఆఫీసర్

## బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌ను రద్దు చేసేందుకు కుట్ర

వైరాటౌన్, ఏప్రిల్ 9: రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా ప్రైవేటు స్కూల్‌లకు బకాయి పడ్డ నిధులను తక్షణం విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చి రద్దు చేసేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఈ పథకం రద్దు అయితే దళిత గిరిజన ప్రజలు పోరాటాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## అన్నారుగూడెంలో రేపు జాతర

వైరాటౌన్, ఏప్రిల్ 9: తల్లాడ మండలం అన్నారగూడెం గ్రామంలో అంకమ్మ, మద్దిరావమ్మ, మహాలక్ష్మమ్మ మహా జాతర రేపు ఉదయం నుంచి ప్రారంభం కానున్నదని ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 14వ వరకు జరిగే జాతర మహోత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

**12 నుంచి గురువమ్మ జాతర**

కారేపల్లి, ఏప్రిల్ 9: మండల పరిధిలోని పేరుపల్లి గ్రామంలో గురువమ్మ జాతర ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఆరు రోజుల పాటు జరిగే ఈజాతరకు ఖమ్మం జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి అనేక మంది భక్తులు తరలి వచ్చి గురువమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కలు చెల్లించుకుంటారని తెలిపారు.

## సీతమ్మ సంస్మరణ సభ

కొణిజర్ల, ఏప్రిల్ 9: సీపీఎం సీనియర్ నాయకుడు దొడ్డపనేని రామయ్య సతీమణి సీతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె సంస్మరణ సభను బుధవారం కొణిజర్లలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సీపీఎం నాయకులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, కొప్పుల కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

బోనకల్లు, ఏప్రిల్ 9: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మధిర– మోటమర్రి రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం చోటు చేసుకుంది. మధిర రైల్వే అవుట్‌పోస్ట్ ఇన్‌చార్జి వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన షేక్ నాగుర్‌భాష (31) బుధవారం తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి మృతుడి వివరాలు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## వంద పడకల హాస్పిటల్‌ను వెంటనే ప్రారంభించాలి

మధిర, ఏప్రిల్ 9: మధిరలో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని బుధవారం పట్టణ బీజేపీ అధ్యక్షుడు శివరాజు సుమంత్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆసుపత్రి ఇంత వరకు ప్రారంభానికి నోచుకోక పోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలపై విశ్వాసం లేదని విమర్శించారు. చిలివేరు సాంబశివరావు, కుంచం కృష్ణారావు, గుండా శేఖర్‌రెడ్డి, పాపట్ల రమేష్, గడ్డం శ్రీహరి, అనగాని రామారావు, కోరిపల్లి శ్రీను, అర్జునరావు పాల్గొన్నారు.

## భద్రాద్రి బ్యాంక్ 22వ శాఖ ప్రారంభం

వైరాటౌన్, ఏప్రిల్ 9: వైరాలోని మెయిన్ రోడ్డులో భద్రాద్రి బ్యాంక్ 22వ శాఖను చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి బుధవారం ప్రారంభించారు. స్ట్రాంగ్ రూమ్‌ను వర్తక సంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు, క్యాష్ కౌంటర్‌ను హరిహరసుత అయ్యప్ప క్షేత్రం చైర్మన్ కొప్పురావూరి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. దాసరి వేణుగోపాల్, ఎల్‌వీఎస్ ప్రసాద్, సన్నే ఉదయ్‌ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, బ్యాంక్ డైరెక్టర్లు, మేనేజర్లు పాల్గొన్నారు.

## రైల్వే ఓవర్ బ్రిడ్జిపై లైట్లు ఏర్పాటు చేయాలి

బోనకల్లు, ఏప్రిల్ 9: బోనకల్లు రైల్వే ఓవర్ బ్రిడ్జిపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి టెలీ కమ్యునికేషన్ అడ్వైజర్ ఉమ్మనేని కృష్ణ బుధవారం వినతిపత్రం అందజేశారు.

## రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న బీజేపీ

కూసుమంచి, ఏప్రిల్ 9: కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగాన్ని అవమానిస్తోందని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాద్ అన్నారు. కూసుమంచిలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కార్యాలయ ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీరభద్రం, వెంకటరత్నం, రవికుమార్, ఉపేందర్, నాయకులు మాజీ ప్రజాప్రతిధులు పాల్గొన్నారు.

## నేడు రజబ్ అలీ, నర్సయ్య వర్ధంతి సభలు

రఘునాథపాలెం, ఏప్రిల్ 9: సుజాతనగర్ విధానసభ మాజీ సభ్యుడు మహ్మద్ రజబ్ అలీ, ఆయన అనుచరుడైన పాపటపల్లి మాజీ సర్పంచ్ కూరాకుల నర్సయ్యల వర్ధంతి సభలను గురువారం నిర్వహించనున్నట్లు వారి కుటుంబ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## 'స్పాట్ బకాయిలు వెంటనే చెల్లించాలి'

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 9: పదో తరగతి స్పాట్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు డీఈవో సోమశేఖరశర్మకి బుధవారం విన్నవించారు. రెమ్యూనరేషన్‌ను అకౌంట్లలో జమచేయాలని కోరారు.

## వేసవిలో పదోన్నతులు చేపట్టాలి

పెనుబల్లి, ఏప్రిల్ 9: ఉపాధ్యాయుల ఉద్యోన్నతులను, బదిలీలను వేసవిలో చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి ప్రభుత్వాన్ని కోరారు. ఆయన బుధవారం వీఎం బంజర హైస్కూల్‌లో టీఎస్ యూటీఎఫ్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులకు సెలవులు ఎక్కువగా ఉన్నాయని సీఎం చెప్పడాన్ని తప్పుబట్టారు. ఇతర ఉద్యోగులకు సంవత్సరానికి 30 రోజులు సంపాదిత సెలవులు ఇస్తారని చెప్పారు. మే 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ఎన్ఎస్ఎస్ విద్యార్థుల రక్తదానం

ఖమ్మం సిటీ/ ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9: ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో దాదాపు 50 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో బుధవారం జరిగిన రక్తదాన శిబిరంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీర్ ఉల్లా మాట్లాడుతూ.. యుక్త వయసులో ఉన్న విద్యార్థులు రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి సాయం చేసిన వారవుతారని అన్నారు.

## గంజాయి కాల్చివేత

మామిళ్లగూడెం, ఏప్రిల్ 9: జిల్లాలోని ఐదు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో వివిధ సందర్భాల్లో పట్టుబడిన రూ.41.50 లక్షల విలువైన 83 కేజీల ఎండు గంజాయిని కాల్చి వేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేంద్రరెడ్డి తెలిపారు. తల్లాడ మండలంలోని గోపాలపేట వద్ద ఉన్న పవర్ ప్లాంట్‌లో బుధవారం ఈ గంజాయి కాల్చివేతను చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలోని 5 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ గంజాయి పట్టుబడిన సందర్భంగా 32 కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

## నృత్యోత్సవంలో 'సర్వజ్ఞ' విద్యార్థిని ప్రతిభ

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 9: ఖమ్మానికి చెందిన తమ విద్యార్థిని ఉండీల అదితి మాన్యా ఇటీవల భద్రాద్రిలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవ నృత్యోత్సవంలో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు ఖమ్మం సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్ రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్ బుధవారం తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 9: సత్తుపల్లి టౌన్–2 ఫీడర్ పరిధిలో లైన్ ఏబీ స్విచ్ వర్క్ కారణంగా గురువారం ఉదయం 8.00 నుంచి 11.30 గంటల విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 'పట్టుదల ఉంటేనే సివిల్స్‌లో నెగ్గగలం'

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 9: ధైర్యం, పట్టుదల ఉంటేనే సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో నెగ్గగలమని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. పోటీ పరీక్షలపై స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రూప్–1 ఫలితాల్లో సత్తా చాటిన అభ్యర్థులను అభినందించారు.

## ఫిజియోథెరిపీ వైద్యశిబిరం

మధిర, ఏప్రిల్ 9: చింతకాని మండలంలోని లచ్చగూడెం గ్రామంలో తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో దివ్యాంగ బాలబాలికల భవిత కేంద్రంలో బుధవారం ఫిజియోథెరిపీ వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ జీ.వసంత శారీరక వైకల్యాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న బాలబాలికలకు వారి తల్లిదండ్రులు సేవలందించాలన్నారు. తప్పనిసరిగా పిల్లలను ఫిజియోథెరిపీ శిబిరానికి తీసుకువచ్చి వైద్యసేవలు అందించాలని కోరారు.